సాక్షి తిరుపతి

బుధవారం ၊ 28 ၊ మే ၊ 2025



తిరుపతి బస్టాండ్ ఆదర్శంగా ఉండాలి

తిరుపతి బస్టాండ్ రాష్ట్రానికే ఆదర్శంగా ఉండాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులకు సూచించారు. - 8లో



డబుల్ మేజర్.. అంతా బేజార్!

ఈ ఏడాది నుంచి డిగ్రీలో డబుల్ మేజర్ సబ్జెక్టులు ప్రవేశపెట్టనున్నారు. కానీ అధ్యాపక పోస్టులు భర్తీ చేయలేదు. - 8లో



గంజాయి ముఠా అరెస్టు

శ్రీకాళహస్తి సమీపంలోని ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

భూసేకరణ పనులు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించి ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. జాతీయ రహదారులతోపాటు రైల్వే ప్రాజెక్టుకు చెందిన భూసేకరణ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్‌భరత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు, నేషనల్ హైవే పీడీలు చెన్నై, నెల్లూరు, తిరుపతి వరుసగా రవీంద్రరావు, వెంకటేశ్వర్లు, వెంకట చలపతి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ



ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ శేషాచలరాజు

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న రేషన్ బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను పారదర్శకంగా ప్రజలకు పంపిణీ చేయాలని డీఎస్‌ఓ శేషాచలరాజు ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి, డీలర్ల ద్వారా రేషన్ పంపిణీ చేయనుంది. ఈ క్రమంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపంపిణీ వ్యవస్థ అధికారులు మంగళవారం మండల పరిధిలోని ఎఫ్‌పీ దుకాణాలను తనిఖీ చేశారు. డీఎస్‌ఓతో పాటు ఇతర అధికారులు తనిఖీలు చేపట్టి, నిల్వ ఉన్న బియ్యంతోపాటు ఇతర నిత్యావసర సరుకులను పరిశీలించారు. అనంతరం వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఎఫ్‌పీ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలుంటాయని పేర్కొన్నారు. అరకొరగా పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందింతే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సీఎస్ డీటీ గంగయ్య, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

మోటార్ల చోరీ నియంత్రణ



కేసుల వివరాలపై ఆరా తీస్తున్న ఎస్పీ విష్ణువర్ధన్‌రాజు

ఏర్పేడు: మండలంలో తరచూ వ్యవసాయ పొలాల్లో రైతులకు చెందిన విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు చోరీ జరుగుతుంటే వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సీఐ శ్రీకాంత్ రెడ్డిని ప్రశ్నించారు. మంగళవారం ఆయన ఏర్పేడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పోలీసు స్టేషన్‌లోని వివిధ కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకుని ఎప్పటి నుంచో శిథిలావస్థకు చేరుకున్న వాహనాలను కోర్టు అనుమతి తీసుకుని వాటిని వాహనదారులకు తిరిగి ఇచ్చేయడమో.. వేలం వేయడమో చేయాలన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 16 అంశాలతో కూడిన బోర్డును పరిశీలించారు. గ్రామాల్లో పల్లె నిద్ర నిర్వహించాలని ఆదేశించారు.



నాడు ప్రజలకు అందుబాటులో సచివాలయం

'ఐదేళ్ల క్రితం వరకు నన్ను నమ్ముకున్న ప్రజలు అష్టకష్టాలు పడేవారు. ఏ వసతులూ లేక అల్లాడిపోయేవారు. పట్టెడన్నం పెట్టే అన్నదాత ఎరువులు, పురుగు మందుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తుంటే నా కడుపు తరుక్కుపోయేది. పెచ్చులూడి, కూలేందుకు సిద్ధంగా ఉన్న బడుల్లో చదవలేక పిల్లలు అగచాట్లు పడుతుంటే చాలా బాధేసేది. సకాలంలో వైద్యం అందక ప్రాణాలు పోగొట్టుకుంటున్న పల్లె ప్రజల బతుకులు ఇంతేనేమోనని దిగులుపడేదాన్ని. నా తల రాత మార్చేవారే లేరా..అని కుమిలిపోయేదాన్ని.

2019 ఎన్నికల తర్వాత ఓ మహానుభావుడు దేవుడిలా దిగివచ్చాడు. పల్లె తలరాతను సమూలంగా మార్చేశాడు. గుమ్మం ఎదుటే ప్రజలకు సేవలందించేందుకు సంకల్పించాడు. అధునాత హంగులతో బడులు.. అత్యాధునిక వసతులతో ఆరోగ్య కేంద్రాలను తీర్చిదిద్దాడు. సరికొత్తగా రైతు భరోసా కేంద్రాలకు శ్రీకారం చుట్టాడు. గాంధీజీ కలలను సాకారం చేస్తూ గ్రామ సచివాలయ వ్యవస్థకు పురుడుపోశాడు. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతి 50 ఇళ్లకు ఒక్కో వలంటీర్ సేవలందించడం చూసి ఆశ్చర్యపోయాను. ఊరు ప్రజలకు కావాల్సిన అన్ని పనులు చక్కదిద్దుతుంటే సంబరపడిపోయాను.

కానీ ఏడాది కాలంగా నన్నెవరూ పట్టించుకోవడం లేదు. నా ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి పనులు ఆగిపోయాయి. అధునాతన వసతులతో రూపుదిద్దుకున్న భవనాలు వెలవెలబోతున్నాయి. మళ్లీ ప్రజలు పట్నానికి పరుగులు తీయడం.. కార్యాలయాల చుట్టూ తిరగడం చూస్తుంటే పాత రోజులు గుర్తుకొస్తున్నాయి'.. అన్నట్టు జిల్లాలోని పల్లెలు కన్నీళ్లు పెడుతున్నాయి. గత ప్రభుత్వంలో చక్కబడిన పాలనను అటకెక్కించి.. మళ్లీ ప్రజలను అష్టకష్టాలు పాలు చేస్తుండడంపై కుమిలిపోతున్నాయి. కూటమి ఏడాది పాలనపై రగిలిపోతున్నాయి.



మూతపడిన విలేజ్ హెల్త్ క్లినిక్



అసంపూర్తిగా వరదయ్యపాలెం మండలంలోని కారిపాకం సచివాలయ భవనం





పల్లె కన్నీరు!



కనిపించని అభివృద్ధి పనులు

- వెలవెలబోతున్న సచివాలయాలు
- ఊసే లేని సంక్షేమ పథకాలు
- నిరుపయోగంగా రైతు భరోసా కేంద్రాలు
- ఖాళీగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- అసంపూర్తిగా నాడు–నేడు పనులు
- కూటమి పాలనలో ప్రజలకు తప్పని ఆపసోపాలు

తిరుపతి అర్బన్/తిరుపతి సిటీ : మళ్లీ పాతరోజులొచ్చాయి. ఇంటి ముంగిటే అందుతున్న సేవలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది. వలంటీర్ వ్యవస్థకు ఫుల్‌స్టాప్ పెట్టేసింది. చిన్నచిన్న సేవలకు కూడా పట్నానికి పరుగులు తీయాల్సి వస్తోంది. వ్యయప్రయాసాలకోర్చి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను గాలికొదిలేశారు. పేదలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూసిన సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టేసింది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యానికి తూట్లు పొడిచింది. నాడు–నేడుతో రూపుదిద్దుకున్న పాఠశాలలను పట్టించుకోకుండా పోయింది.

సచివాలయాల్లో కానరాని సేవలు

గత ప్రభుత్వంలో జిల్లాలో 691 సచివాలయాల ద్వారా ప్రజలకు ఇంటివద్దకే సేవలందించేవారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి రేషన్ కార్డులు, ఆధార్‌తో పాటు ధ్రువీకరణ పత్రాలు ఇంటి వద్దే అందించారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సచివాలయాల్లో సిబ్బందికి 32కు పైగా సర్వేలు అంటగట్టారు. దీంతో ఏ ఒక్కరూ సచివాలయం ముఖం చూడడం లేదు. ప్రజలు సచివాలయాలకు వెళ్లడం మానేసి గతంలో లాగే మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సచివాలయాలు బోసిపోతున్నాయి. 442 రైతు భరోసా కేంద్రాలను 50 శాతం తగ్గించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందించే నాథుడే లేకుండా పోయారు.

సూపర్ సిక్స్ హామీలు గాలికి

ఎన్నికల సమయంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ అంటూ ఊదరగొట్టింది. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500, తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.15వేలు, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి ప్రతి రైతుకూ రూ.20 వేలు, ఏడాదికి 25 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రతి నిరుద్యోగికి యువగళం నిధికింద నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికీ మంచినీటి కొళాయి, పేదల ఆదాయం రెట్టింపు అంటూ ప్రగల్భాలు పలికారు. గత ఏడాదిగా ప్రజలు ఎదురు చూస్తున్నా ఏ ఒక్క పథకాన్నీ అమలు చేయలేదు.

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలు

గత ప్రభుత్వం నిర్మించిన ఆరోగ్య కేంద్రాలు, పంచాయతీ భవనాలు, మల్టీపర్పస్ గోదాములు, రైతు సేవా కేంద్రాలు, సచివాలయ భవనాలు, పాఠశాలల మరమ్మత్తులు, నూతన భవనాలు, పశువైద్య శాలలు, విద్యార్థుల వసతిగృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.



తిరుపతి రూరల్ పరిధిలోని ఓ గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు తెరిచారు. తర్వాత ఒక్కొక్కరుగా సిబ్బంది విధులకు హాజరయ్యారు. ఆ గ్రామానికి చెందిన ఒకరు రేషన్ కార్డు దరఖాస్తు కోసం రాగా.. సర్వర్ సహకరించకపోవడంతో వెనుదిరిగాడు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలెవ్వరూ కానరాలేదు. మధ్యాహ్నం 2 గంటకు తర్వాత సచివాలయ సిబ్బంది కొందరు మండల కార్యాలయానికి వెళ్లారు. సాయంత్రం 4 గంటల వరకు కూడా సచివాలయంలో ప్రజల తాకిడి లేదు. పథకాలు లేకపోవడం, గ్రామ సచివాలయంలో సేవలు స్తంభించడంతో ప్రజలు రావడం మానేశారు. ఇదే సచివాలయానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోజూ 50 నుంచి వంద మంది వరకు వచ్చేవారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండానే వివిధ సేవలు పొందేవారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఆర్బీకేలు కళకళలాడేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. హామీలు గాలికొదిలేసి ప్రజలను కష్టాల్లోకి నెట్టేస్తోంది.

తిరుపతి జిల్లా సమాచారం

పింఛన్ల తొలగింపు	10వేలు
కొత్త పింఛన్లు	నిల్
కొత్త రేషన్ కార్డులు	నిల్
ఫీజురీయింబర్స్‌మెంట్	నిల్
విద్యాదీవెన, వసతి దీవెన	నిల్
అన్నదాత సుఖీభవ	నిల్
తల్లికి వందనం	నిల్
ఆడబిడ్డ నిధి	నిల్
మహిళలకు ఉచిత బస్సు	నిల్
ఆరోగ్యశ్రీ –	నిర్వీర్యం
శిథిలావస్థకు చేరుతున్న భవనాలు	85
మూతపడనున్న సచివాలయాలు	349
మూతపడ్డ ఆర్బీకేలు	214
పనిచేయని విలేజ్ క్లినిక్‌లు	332
మరమ్మత్తులకు నోచుకోని ప్రభుత్వ పాఠశాలలు	50కి పైగా
వసతి గృహాలు	21

కష్టాలు తప్పడం లేదు



గతంలో వ్యక్తిగత, గ్రామ సమస్యలను పరిష్కరించుకునేందుకు సచివాలయాలకు వెళ్లేవాళ్లం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లు ఉండడం లేదు. అదేమని అడిగితే సర్వేలకు వెళ్లారని చెబుతున్నారు.

– తుపాకుల ప్రసాద్, మన్నారుపోలూరు

మీ సేవకు వెళ్లాం



మా అబ్బాయి ఓ ప్రయివేటు కళాశాలలో ఇంజినీరింగ్ చేస్తున్నాడు. వాడికి ఓబీసీ సర్టిఫికెట్ కావాలని అడిగారు. అన్ని వివరాలను తీసుకుని సచివాలయానికి వెళితే అక్కడ సిబ్బంది లేరు. కనీసం సమాచారం చెప్పే వారు కూడా లేరు. చివరకు ఓ వ్యక్తి మీ సేవకు వెళ్లమని సలహా ఇచ్చారు. గతంలో సచివాలయంలోనే సర్టిఫికెట్లు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. – ఎం.రమేష్, సూళ్లూరుపేట

చేనేతలను ఆదుకునేవారు లేరు



గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా ఒక్కో కార్మికునికి రూ.24000 వచ్చేది. చేనేత క్లస్టర్ యూనిట్స్‌కు సబ్సిడీతో విద్యుత్ అందించేవారు. కూటమి సర్కార్ చేనేతలను ఆదుకునే దిశగా ఒక్క పథకమూ అమలు చేయలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నాం.

–శ్రీనివాసులు, చేనేత కార్మికుడు, వెంకటగిరి

వైద్యం అందడం లేదు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్థాయిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చి వాటిని నిర్వీర్యం చేసింది. అందులో పనిచేస్తున్న సీహెచ్‌ఓలకు వేతనాలు ఇవ్వకుండా వేధిస్తోంది. నెల రోజులకు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మూతపడ్డాయి. రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

–ఓదూరు ఉజ్వల్ రెడ్డి, బత్తలవల్లం, వరదయ్యపాళెం మండలం

గతంలో పల్లవించిన ప్రగతి



నాడు–నేడులో సకల వసతులతో..

సుదీర్ఘ పాద యాత్ర అనంతరం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచే పల్లె రూపురేఖలు మార్చేశారు. ప్రతి చిన్న పనికీ మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగకూడదనే ఉద్దేశంతో గ్రామ సచివాలయాలను నిర్మించారు. ప్రతి 50 కుటుంబాలకు ఇంటివద్దకే పథకాలను, ప్రభుత్వ సంక్షేమాన్ని అందించేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. రైతులకు గ్రామంలోనే రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులోకి తెచ్చారు. పంట కొనుగోళ్లను చేపట్టి రైతుకు గిట్టుబాటు ధర కల్పించారు. రైతు భరోసా పేరుతో పెట్టుబడి నిధి కింద ఏడాదికి రూ.13,500 అందించారు. రుణాలు, బీమాను పక్కాగా అమలు చేశారు. ప్రతి కుటుంబానికీ వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కూతవేటు దూరంలోనే విలేజ్‌హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. పేదలు, వృద్ధులకు ఉచిత మందులతో పాటు ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.25 లక్షల వరకు శస్త్ర చికిత్సలకు అవకాశం కల్పించారు. అమ్మఒడి పథకం కింద జిల్లాలో 3.4 లక్షల మందికి ప్రతి ఏటా రూ.15 వేల చొప్పున అందించారు. మహిళా సంఘాలకు వడ్డీ రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్య, ఫీజురీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు చేతోడు వంటి పథకాలను అందించి ఆదుకున్నారు.



కళకళలాడుతున్న సచివాలయం

నాడు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి



నాడు–నేడు పథకం కింద గత ప్రభుత్వంలో పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. మా ఊరులో ఉన్న ప్రాథమిక పాఠశాల అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉంది. గత ప్రభుత్వంలో అదనపు తరగతి గదులు కట్టించారు. కూటమి ప్రభుత్వం మా పాఠశాలను మూసివేసి కిలోమీటరు దూరంలోని హరిపురం కాలనీకి బదిలీ చేయాలని చూస్తోంది.

– మేర్లపాకు శివప్రసాద్, పేరూరు, తిరుపతి రూరల్

నాడు రైతుకు భరోసా ఉండేది



నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. జగనన్న ప్రభుత్వంలో ఏటా రూ.13,500 వచ్చేది. ఈ డబ్బులు పెట్టుబడికి సరిపోయేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క పైసా ఇవ్వలేదు. ఎన్నికల హామీలో ఇస్తామన్న రూ.20 వేలు కూడా ఇంతవరకు ఇవ్వలేదు. పెట్టుబడికి అప్పులు చేయాల్సి వస్తోంది. –మునిశేఖర్ యాదవ్, రైతు, గాజులమండ్యం, రేణిగుంట మండలం

సొంతింటి కల నెరవేరింది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాకాడు మండలం, సిద్ధిగుంటపాళెం గ్రామం వద్ద జగనన్న లేఔట్‌లో స్థలంతో పాటు కాలనీ ఇల్లు నిర్మించి ఇచ్చారు. అద్దె ఇంట్లో నుంచి మా సొంత ఇంట్లోకి వచ్చాం. ఎంతో సంతోషంగా ఉంది. – రాయపు రాజేష్, సుజన దంపతులు, వాకాడు మండలం





తనపల్లిలో ఒకేచోట ఏర్పాటు చేసిన గ్రామస్థాయి కార్యాలయాలు



నెలబల్లిలో ప్రభుత్వ భవనాల సముదాయం

- ఏడాది పాలనలో హామీలు అమలు చేయకుండా మోసం
- కూటమి అరాచకాలు, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు
- జూన్ 4న వెన్నుపోటు దినంగా పరిగణించుకుందాం
- నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- భూమన పిలుపు

వెన్నుపోటు రాజకీయాలు

బాబుకు వెన్నతో పెట్టిన విద్య



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

తిరుపతి మంగళం : నమ్మిన వాళ్లను నట్టేటముంచి వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ అధికార దాహంతో పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి తెలుగుదేశం పార్టీని సొంతం చేసుకున్న వెన్నుపోటుదారుడు చంద్రబాబు అని గుర్తుచేశారు. ఆ తర్వాత ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో ప్రజలకు మాయ మాటలు చెప్పి అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడం చంద్రబాబు నైజమన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు వరగొపెట్టిందేమీలేదన్నారు. గత ఎన్నికల్లో జగనన్న కంటే కూడా ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తానని ప్రజలను మరోసారి వంచించి అధికారంలోకి వచ్చిన జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా పరిగణించడం జరిగిందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా పరిగణించి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపారు. అనంతరం మేయర్ శిరీష మాట్లాడారు. చంద్రబాబుకు అధికారం తప్ప ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి పట్టదన్నారు. తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ జూన్ 4వ తేదీ నిర్వహించే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేత జయచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గీతాయాదవ్, కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, ఆదం రాధాకృష్ణారెడ్డి, కోటూరు ఆంజినేయులు, అనీష్‌రాయల్, ఆరణి సంధ్య, కోటేశ్వరమ్మ, పుణీత, ఆదిలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

–13 కిలోల గంజాయి స్వాధీనం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి ముఠాకు చెందిన వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ నరసింహ మూర్తి వెల్లడించిన వివరాలు.. కచ్చితమైన సమాచారం మేరకు రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఎంజీఎం వద్ద తచ్చాడుతున్న ముగ్గురు తమిళనాడుకు చెందిన మురళి, శ్యామ్‌రాజ్, సంజయకుమార్ అనే ముగ్గురుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించి సురేష్, అంబత్తూరుకు చెందిన ఓ వ్యక్తి ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిపారు. వీరిపై తమిళనాడులో పలు క్రిమినల్ కేసులున్నట్లు తెలిసింది. పారిపోయిన మరో ఇద్దరిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి, ఎస్ఐ సారథిని, సిబ్బంది బాలకృష్ణ, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, నందకుమార్, ప్రవీణ్, సుధాకర్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్డు దాటుతూ వలస కార్మికుడి మృతి

ఏర్పేడు : ఏర్పేడు–శ్రీకాళహస్తి మార్గం మేర్లపాక దళితవాడ సమీపంలోని పుష్పిత్ కర్మాగారం ఎదురుగా సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందాడు. ఏర్పేడు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలీఘడ్ జిల్లా టియారీ గ్రామానికి చెందిన ఓంప్రకాష్ కుమారుడు రిషికేష్(33) అనే వలస కార్మికుడు సోమవారం రాత్రి తన స్నేహితులతో పాటు మేర్లపాక పుష్పిత్ ఫ్యాక్టరీ ఎదురుగా రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం రిషికేషను ఢీకొంది. ఈ ప్రమాదంలో రిషికేష్ తలకు బలమైన రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ సంయుక్తంగా ఉన్నతోద్యోగాలకు ప్రత్యేక నైపుణ్యం కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్ చంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్వీ మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్ఏసీ శిక్షణా కేంద్రంలో 30 రోజుల పాటు అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. అడ్వాన్స్ టెక్నాలజీపై స్కిల్ హబ్ ట్రైనింగ్ ఉంటుందని చెప్పారు. 15–45ఏళ్ల వారు అర్హులని, ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. ఆమేరకు 'నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్' లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9701440274, 9703437472, 9866241270 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.



డబుల్ మేజర్.. అంతా బేజార్!

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు తయారైంది.. డిగ్రీలో డబుల్ మేజర్ సబ్జెక్టుల పరిస్థితి. ఈ ఏడాది నుంచి రెండు మేజర్ సబ్జెక్టులు ఎంచుకుని విద్యార్థులు చదువుకునే వీలు కల్పించినా.. అందుకు తగ్గ విధంగా అధ్యాపకుల కొరతపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. నోటిఫికేషన్ విడుదలయ్యేలోపైనా దీనిపై చర్చించి సమస్య పరిష్కరిస్తారో.. లేదా అలాగే వదిలేస్తారో వేచి చూడాలి మరి.

ఈ ఏడాది నుంచి డిగ్రీలో డబుల్ మేజర్ సబ్జెక్టులు

- కరిక్యులమ్ రూపకల్పన పూర్తి చేసిన ప్రొఫెసర్ వెంకయ్య కమిటీ
- వీసీలు, నిపుణులతో చర్చించి నిర్ణయించిన ఉన్నత విద్యామండలి
- ఏఐ, మిషన్‌లర్నింగ్ కోర్సులతో సరికొత్త డిగ్రీలు
- అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల సంగతేమిటో?
- జిల్లాలో ఓఏఎమ్‌డీసీ నోటిఫికేషన్ కోసం 30 వేల మంది ఎదురుచూపు

తిరుపతి సిటీ: విద్యారంగంలో నూతన సంస్కరణల్లో భాగంగా డిగ్రీలో ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ సబ్జెక్టులను ప్రవేశపెట్టనున్నారు. ఇదివరకు ఉన్న సింగిల్ మేజర్ సబ్జెక్టుతో పాటు మరో మేజర్ సబ్జెక్ట్‌ను విద్యార్థులు అభ్యసించనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కరిక్యులమ్ రూపకల్పన కోసం నియమించిన రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకయ్య కమిటీ నివేదిక సమర్పించింది. ఈ ఏడాది విడుదలయే ఓఎమ్‌డీసీ నోటిఫికేషన్‌లో డబుల్ మేజర్ సబ్జెక్టులను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని వర్సిటీల వీసీలతో, నిపుణులతోనూ సమావేశమై తుది నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఉన్న మల్టీడిసిప్లీనరీ విధానంలో మూడు సబ్జెక్టులు మేజర్‌గా ఉండేవి. 2023–24లో సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌తో డిగ్రీ పూర్తిచేసే అవకాశం కల్పించారు. ఇప్పుడు రెండు మేజర్ సబ్జెక్ట్‌లను విద్యార్థి చదవాల్సిందేనంటూ సరికొత్త విధానాన్ని అములు చేయబోతున్నారు.

ఏఐ, మిషన్‌లర్నింగ్ కోర్సులతో సరికొత్త డిగ్రీలు

డబుల్ మేజర్ సబ్జెక్ విధానంలో డిగ్రీలో నూతన కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. మేజర్ సబ్జెక్టులకు అనుసంధానంగా మైనర్ సబ్జెక్టులుగా క్వాంటమ్ కంప్యూటింగ్, మెషిన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ సబ్జెక్టులను చేర్చేందుకు కసరత్తు పూర్తిచేశారు. దీంతో బీటెక్ సాంకేతిక విద్యనభ్యసించే వారికి మాత్రమే అందుబాటులో ఉండే ఈ సబ్జెక్ట్‌లను డిగ్రీ చదివే విద్యార్థులు మైనర్ సబ్జెక్ట్‌లుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉండనుంది.

ఎదురుచూపులు

ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదలై సుమారు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ ప్రవేశాల కోసం వెలువడే ఓఏఎమ్‌డీసీ (ఆన్‌లైన్ అడ్మిషన్స్ టు డిగ్రీ కాలేజస్) నోటిఫికేషన్ విడుదల చేయలేదు. నోటిఫికేషన్ కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 35 వేల మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. కానీ డబుల్ మేజర్ సబ్జెక్ట్ అంటూ విద్యార్థులను కన్‌ఫ్యూజన్‌లోకి నెడుతూ ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. దీంతో పలువురు విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్, పలు కంప్యూటర్ డిగ్రీ కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు.

ఎస్వీయూ పరిధిలో డిగ్రీ కళాశాలల సమాచారం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	18
టీటీడీ కళాశాలలు	5
ప్రైవేటు కళాశాలలు	104
సింగిల్ మేజర్ సబ్జెక్‌తో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు	25 వేల మంది
డిగ్రీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు	30 వేల మంది

డబుల్ మేజర్ అంటే..

డబుల్ మేజర్ సబ్జెక్టులు అంటే డిగ్రీలో రెండు ప్రధాన సబ్జెక్టులను విద్యార్థులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ప్రధాన మేజర్ సబ్జెక్ట్‌కు 48 క్రెడిట్లు, రెండో మేజర్ సబ్జెక్ట్‌కు 32 క్రెడిట్లు ఇవ్వనున్నారు. ఎంపిక చేసుకున్న మేజర్ సబ్జెక్ట్‌లలో ఏదో ఒకదానిలో పీజీ చేసుకునే అవకాశం ఉంటుంది. మరో మైనర్ సబ్జెక్ట్‌గా విద్యార్థులకు ఇష్టమైన సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు బీఎస్సీ ఎంపీసీలో విద్యార్థి తనకు నచ్చిన మ్యాథ్స్, ఫిజిక్స్‌ను రెండు మేజర్ సబ్జెక్టులుగా ఎంపిక చేసుకోవచ్చు. మూడవ సబ్జెక్ట్‌గా ఏదేని మైనర్ సబ్జెక్ట్‌ను ఎంపికచేసుకుని అభ్యసించవచ్చు. నూతన విద్యా విధానంలో భాగంగా 2020–21 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ ప్రస్తుతం అమలులో ఉంది. కానీ విద్యార్థులు మూడేళ్ల డిగ్రీపైనే మొగ్గు చూపుతున్నారు.

అధ్యాపకుల కొరత మాటేమిటో?

ప్రభుత్వం డిగ్రీ విద్య విషయంలో గందరగోళం సృష్టిస్తోంది. డబుల్ మేజర్ సబ్జెక్టులను ప్రవేశపెడుతూ నోటిఫికేషన్‌ను త్వరలో విడుదల చేయనున్న ఉన్నత విద్యామండలి అసలు విషయం బోధన సిబ్బంది కొరతపై ఆలోచించకపోవడం గమనార్హం. అన్ని ఉన్నా.. అల్లుడునోట్లో శని అనే చందంగా తయారైంది కూటమి ప్రభుత్వ పాలన. డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు, ల్యాబ్ సౌకర్యాలు, అధ్యాపకుల కొరతతో జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలలు సతమతమవుతున్నాయి. ఇప్పటికే పలు కళాశాలల్లో మేజర్ సబ్జెక్టులకు శాశ్వత అధ్యాపకులు కొరతతో విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా డబుల్ మేజర్ అంటూ ఊదరగొడితే నష్టపోయేది విద్యార్థులే.

ఉపాధి అవకాశాలు మెండు



“ఉన్నత విద్యామండలి ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ సబ్జెక్ట్‌లను డిగ్రీలో ప్రవేశపెట్టడం ఆహ్వానిస్తున్నాం. విద్యార్థి రెండు మేజర్ సబ్జెక్టులలో పట్టు సాధించి ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవచ్చు. ఇప్పటికే అందిరి వీసీలు, విద్యారంగ నిపుణులతో చర్చించి నిర్ణయించారు. ప్రొఫెసర్ వెంకయ్య కమిటీ కరిక్యులమ్ రూపకల్పన పూర్తి చేసిందని చెప్పారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఓఏఎమ్‌డీసీ నోటిఫికేషన్ త్వరలో విడుదలవుతుంది. –సీహెచ్.అప్పారావు, వీసీ, ఎస్వీయూ

శ్రీవారి దర్శనానికి 18 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 83,542 మంది స్వామివారిని దర్శించుకోగా 34,265 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.09 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రైలు పట్టాలపై మహిళ మృతదేహం



వెంకటగిరి రూరల్ : రైలు పట్టాలపై గుర్తుతెలియని మహిళ మృతదేహం గూడూరు రైల్వే పోలీసులకు లభ్యమైంది. ఈ ఘటన పట్టణంలోని వెంకటగిరి–నాయుడుపేట గేటుకు కొద్ది దూరంలో మంగళవారం చోటుచేసుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వెంకటగిరి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని (50) మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. రైల్లో నుంచి జారిపడి గాని, రైలు ఢీకొని గాని మహిళ మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గుడిమల్లం ఈఓ అక్రమాలపై విచారణ



గుడిమల్లం శ్రీఆనందవల్లీదేవి సమేత పరశురామేశ్వర స్వామి ఆలయం

ఏర్పేడు : మండలంలోని గుడిమల్లంలో వెలసిన పురాతన శైవక్షేత్రం శ్రీ ఆనందవల్లీ దేవి సమేత పరశురామేశ్వరాలయ ఈఓ రామచంద్రారెడ్డి అక్రమాలపై దేవాదాయశాఖ అధికారులు విచారణ చేపట్టారు. పల్లవుల కాలం నాటి భారతదేశపు తొలి శైవక్షేత్రంగా చారిత్రక నేపథ్యం ఉన్న ఈ ఆలయం పురావస్తుశాఖ ఆధీనంలో ఉంది. ఆలయంలో పూజా కైంకర్యాల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర దేవాదాయశాఖ చూసుకుంటోంది. అయితే ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, రాజ్యాంగేతర శక్తిగా ఆలయంలో పెత్తనం చెలాయిస్తున్న మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడుపై ఇటీవల గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో సోమవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ గుడిమల్లం ఆలయానికి చేరుకుని విచారణ జరిపారు. ఆలయానికి వస్తున్న ఆదాయం, వ్యయాలకు సంబంధించి నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టారు. అలాగే మాజీ చైర్మన్ ఏ హోదాలో ఆలయంలో సిబ్బందిపై పెత్తనం చెలాయిస్తూ వీఐపీ దర్శనాలలో పాల్గొంటున్నారనే విషయంపై ఆయన ఆరా తీశారు. ప్రధానంగా ఆలయంలో సోమవారం ఉదయం ఒక్కసారి మాత్రమే అభిషేక పూజలు, హారతులకు అనుమతి ఉందని, అయితే ఆ నిబంధనలను అతిక్రమించి వీఐపీలు వచ్చినప్పుడు, తరచూ అభిషేకాలు చేస్తుండటం వల్ల మూలవిరాట్ ఏకశిలా విగ్రహం దెబ్బతినే ముప్పు ఉందని పురావస్తుశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో దానిపైనా విచారణ చేసి నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం.

పరిశ్రమ బస్సు కింద పడి కార్మికురాలి మృతి

చిల్లకూరు : మండలంలోని ఓడూరు పంచాయతీ పరిధిలోని ఓ రొయ్యల పరిశ్రమ వద్ద కార్మికులను దించి వెనకకు తీస్తున్న బస్సు కింద పడి ఓ కార్మికురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు రొయ్యల పరిశ్రమలో పని చేసేందుకు ఒడిస్సా రాష్ట్రం గంజామ్ జిల్లా సనగోపాల్‌పూర్ నుంచి ఏడాది కిందట కొంత మంది కార్మికులు వచ్చి పనిచేసుకుంటూ పరిశ్రమలోనే వసతి పొందుతున్నారు. ఈ క్రమంలో శివాని మహాతుడా (45) అనే కార్మికురాలు విధుల్లోకి వెళ్లే సమయంలో పరిశ్రమ బయట వేచి ఉంది. అదే సమయంలో బయట ప్రాంతం నుంచి కార్మికులను తీసుకుని వచ్చిన బస్సు కార్మికులను దించి వెనుదిరుగుతున్న సమయంలో వెనుకగా ఉన్న కార్మికురాలిని గుర్తించకుండా బస్సును వెనుకకు తీశాడు. దీంతో ఆమె బస్సు వెనుక చక్రాల కింద పడి తీవ్ర గాయాలపాలైంది. దీంతో ఆమెను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆమె మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పాలిటెక్నిక్ కళాశాలల్లో అగ్రికల్చర్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వచ్చేనెల 16వ తేదీ లోపు ఎన్జీ రంగా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. డిప్లొమోలో ప్రవేశాలకు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష ఉండదన్నారు.

క్షేత్రస్థాయిలో కాదు..ఆఫీసుల్లోనే సర్వే!

- వీధి వ్యాపారుల సర్వే నిర్వహణలో ఇదీ అధికారుల తీరు

తిరుపతి కల్చరల్: జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలు, తిరుపతి కార్పొరేషన్ పరిధిలో వీధి వ్యాపారుల ఆర్థిక స్థితిగతులపై సర్వే చేయడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.శివకుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, హైకోర్టు ఆదేశాలు, 2014 వీధి వ్యాపారుల చట్టం ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి ఈ సర్వే చేయాలని, ప్రస్తుతం జిల్లాలో సర్వే చేస్తున్న విధానంపై పూర్తి అసంతృప్తి వ్యక్తమవుతోందని తెలిపారు. గతంలో మెప్మా ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ప్రతి వ్యాపారి వద్దకు వెళ్లి ఏం వ్యాపారం చేస్తున్నారు? ప్రభుత్వ నుంచి రుణాలు ఏమైనా తీసుకున్నారా? ఎన్నేళ్లుగా వ్యాపారం చేస్తున్నారు?..ఇత్యాది అంశాలతో సర్వే చేసి గుర్తింపు కార్డులు మంజూరు చేసేవారని తెలిపారు. ప్రస్తుతం వెల్ఫేర్ కార్యదర్శులు చేస్తున్న సర్వే దీనికి పూర్తిగా భిన్నంగా ఉందని, ఆఫీసుల వద్దకు వ్యాపారులను పిలిపించుకోవడం సరికాదన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసి, విక్రయదారులను గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

తిరుపతి బస్టాండ్ ఆదర్శంగా ఉండాలి

తిరుపతి అర్బన్ : తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ రాష్ట్రానికే ఆదర్శంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లాలోని ఆర్టీసీ డీఎంలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం ప్రయాణికులు, భక్తులతో ముడిపడి ఉండే ఆర్టీసీ సంస్థ కీలకమైనదిగా పేర్కొన్నారు. దేశవిదేశాల నుంచి భక్తులు తిరుపతికి విచ్చేస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు వారితో మర్యాదగా వ్యవహరించాలని చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల నుంచి అధిక మొత్తంగా... బస్టాండ్‌లో వస్తువులు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్సుల సమయపాలనతో పాటు శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యం ఉండాలని వెల్లడించారు. బస్టాండ్లలో చోరీలకు స్వస్తి చెప్పాలని పేర్కొన్నారు. బస్టాండ్లను నిషేధిత వస్తువుల రవాణాతో పాటు విక్రయాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని చెప్పారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకట్రామ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, తిరుపతి బస్టాండ్ డీఎం బాలాజీ, ఏటీఎం డీఆర్‌నాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల సర్టిఫికెట్ల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : గ్రేడ్–2 హెచ్ఎం ఉద్యోగోన్నతుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఎయిడెడ్ పాఠశాలలో పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 150 ఖాళీలకు గ్రేడ్–2 హెచ్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించనున్నారు. ఈ ప్రక్రియను డీఈఓ వరలక్ష్మి, ఏడీ వెంకటేశ్వర రావు పరిశీలించారు.



సర్టిఫికెట్లను పరిశీలన చేస్తున్న హెచ్ఎంలు

ఇసుక అక్రమరవాణాపై నిఘా



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రేణిగుంట: ఇసుక, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ విష్ణువర్ధన్‌రాజు సిబ్బందిని ఆదేశించారు. ఆయన మంగళవారం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లోని ప్రజలతో మమేకం కావాలన్నారు. జైల్ నుంచి బయటకు వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మంజునాథ రెడ్డి, ఎస్ఐ సుధాకర్ ఉన్నారు.

చైన్ స్నాచింగ్

శ్రీకాళహస్తి : పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన సురేఖ తన నివాసం ఎస్వీయూ కళాశాల మైదానానికి వాకింగ్‌కు వెళుతుండగా గుర్తు తెలియనివ్యక్తి మెడలోని 32 గ్రాముల బంగారు చైనును అపహరించుకుపోయారు. ఈ సంఘటనపై 2వ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి వివరాల మేరకు..బంగారమ్మ ఆలయం నుంచి బాలసదన్ మార్గం గుండా గ్రౌండుకు వెళుతుండగా బైక్ మీద వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి గొలుసు లాక్కుపోయినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మామిడల్

- పడిపోయిన మామిడి ధరలు



మామిడి కాయల ప్యాకింగ్‌లో వ్యాపారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరం కట్టమంచిలోని మామిడి కాయల మార్కెట్ మంగళవారం బోసిపోయింది. వారం రోజులుగా మార్కెట్‌కు టేబుల్‌రకాలు 15 టన్నుల వరకు వచ్చేవి. మంగళవారం కేవలం 4 టన్నుల బేనీషా కాయలు మాత్రమే వచ్చాయని ట్రేడర్లు చెబుతున్నారు. పడిపోయిన మామిడి ధరల కారణంగా రైతులు కోతలను నిలిపేశారు. రేట్లు వచ్చిన తర్వాత అమ్ముకుందామని కోతకు బ్రేక్ వేశారు. ఎక్కువగా బెంగుళూరు, చెన్నైలో ఉన్నవారికి విక్రయాలు చేసుకుంటున్నారు. బల్క్ బుకింగ్ చేసుకుని వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బేనీషా కిలో రూ.15, చందూర రూ.4 నుంచి రూ.5, అల్ఫోన్సో రూ.25, తోతాపూరి (టేబుల్‌రకం) రూ. 10 వరకు పలుకుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఫైనల్‌కు చేరిన పాయ్ వైస్రాయ్ జట్టు



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న సూర్య



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న సల్మాన్

- నేడు ఆదిత్య, హైపీరియన్ జట్ల మధ్య సెమీస్
- నేటి ఉదయం ఉమెన్స్ ఎక్స్‌పోజర్ మ్యాచ్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) నిర్వహిస్తున్న చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్–1) క్రికెట్ పోటీలు తుది అంకానికి చేరాయి. ఇప్పటికే పాయ్ వైస్రాయ్ జట్టు పాయింట్ల పట్టికలో మొదటి స్థానానికి చేరి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. అలాగే 2, 3వ స్థానాల్లో ఉన్న ఆదిత్య, హైపీరియన్ జట్లు మధ్య బుధవారం మధ్యాహ్నం సెమీఫైనల్స్ జరగనుంది. ఇక సీపీఎల్–1లో భాగంగా మహిళా క్రికెటర్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బుధవారం ఉదయం 8గంటలకు ఉమెన్స్ ఎక్స్‌పోజర్ మ్యాచ్‌ను సీడీసీఏ నిర్వహించనుంది. ఈ మ్యాచ్‌లో జిల్లా, జోన్, రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న మహిళా క్రికెటర్లు ఆడనున్నారు.

5వికెట్ల తేడాతో పాయ్ వైస్రాయ్ జట్టు విజయం

మంగళవారం ఉదయం పాయ్ వైస్రాయ్–హైపీరియన్ జట్ల నడుమ నిర్వహించిన తొలి సెమీస్‌లో పాయ్ వైస్రాయ్ అలవోకగా విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైపీరియన్ 15.3ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 101పరుగులు సాధించింది. సీమర్ల ధాటికి హైపీరియన్ జట్టు టాప్ ఆర్డర్ కుప్పకూలింది. బౌలర్లు సూర్య 4, చరణ్‌తేజ్ 3, జావిద్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 102పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేసిన పాయ్ వైస్రాయ్ జట్టు 15ఓవర్లలో విజయం సాధించింది. బౌలింగ్‌లో 4వికెట్లు, బ్యాటింగ్‌లో 22పరుగులు చేసిన ఆ జట్టు కెప్టెన్ సూర్య మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌ను అందుకున్నాడు.

4వికెట్ల తేడాతో స్పార్టన్ జట్టు విజయం

ఇదేరోజు మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిత్యపై స్పార్టన్ జట్టు గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిత్య లెవెన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో అభిషేక్ 51బంతుల్లో 82, కల్యాణ్ 19బంతుల్లో 41పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన స్పార్టన్ జట్టు 19ఓవర్లలోనే 6వికెట్ల నష్టానికి 188పరుగులు చేసి విజయం సాధించింది. ఆసీఫ్‌రెడ్డి 39 బంతుల్లో 54, మోనీష్ 22బంతుల్లో 40, సల్మాన్ 23బంతుల్లో 39పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించారు. 39పరుగులు, 1వికెటు సాధించిన సల్మాన్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌ను అందుకున్నాడు.